క్లుప్తంగా

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

కణేకల్లు: ఉరవకొండ–కణేకల్లు రోడ్డు నుంచి కళేకుర్తి గ్రామ శివారు వరకు రూ.1.08 కోట్లతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శుక్రవారం భూమి పూజ చేశారు. కళేకుర్తికళ్లే రోడ్డు మెయిన్‌రోడ్డు నుంచి అధ్వానంగా ఉండడంతో రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచు యు.ఆనంద్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

కుందుర్పి: మండలంలోని రుద్రంపల్లి గ్రామ శివారులో రైతు నాగభూషణం పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం దుండగులు ధ్వంసం చేశారు. అందులోని కాపర్‌ను ఎత్తుకెళ్లారు. బాధిత రైతు నాగభూషణం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మండలంలోని పలు గ్రామాల్లో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి.

కబడ్డీలో సత్తాచాటిన విద్యార్థి



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి అభిషేక్

డి హీరేహాళ్ (రాయదుర్గం): డీ హీరేహాళ్ మండలం మురడి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థి కే అభిషేక్ ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్–14 కబడ్డీ పోటీల్లో సత్తాచాటి, ఉమ్మడి జిల్లాల నుంచి అండర్–14 టీఎంకు ఎంపికయ్యాడు. ఈ నెల 9 నుంచి 11 వరకు బాపట్లలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటాడని హెచ్‌ఎం చంద్రశేఖర్, పీడీ రాజశేఖర్‌రెడ్డి లు తెలిపారు. శుక్రవారం కబడ్డీ విజేతను సన్మానించారు.

ఆంజనేయస్వామి మహోత్సవం

శెట్టూరు: మండల కేంద్రంలో ఆంజనేయ స్వామి విగ్రహ, ధ్వజ, కలశ, నాగప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ చేయనున్నట్లు తెలిపారు. శనివారం గంగపూజ, గణపతిపూజ, పుణ్యావాహచనం, పంచగవ్య ప్రాశన, రక్షాబంధనం, కలశస్థాపన, నవగ్రహ ఆరాధన కార్యక్రమాలు, ఆదివారం ప్రాతఃకాలార్చన, ఆంజనేయ స్వామి ధ్వజస్థభనం, నాగుల విగ్రహాలకు బింబశుద్ధి, మహా మంగళహారతి, గ్రామోత్సవం కార్యక్రమాలు, చివరి రోజు సోమవారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, నాగప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం ఉంటాయన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్




జూదరులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

బొమ్మనహాళ్: కర్ణాటక సరిహద్దులోని హెచ్చెల్సీ సమీపంలోని పొలాల్లో పేకాట ఆడుతున్న 13 మందిని అరెస్ట్ చేసినట్లు బొమ్మనహాళ్ ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. కర్ణాటక సరిహద్దులోని జిల్లా పరిధిలో ఉన్న గ్రామాల్లో పేకాట జోరుగా సాగుతున్న వైనంపై 'సరిహద్దులు దాటిన జూదం' శీర్షికన ఈ నెల 5వ తేదీ 'సాక్షి'లో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ నేతృత్వంలో పోలీసులు ఆంధ్రా సరిహద్దులోని హెచ్చెల్సీ వెంబడి శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో 13 మంది పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.87,040 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. పట్టుబడిన వారిలో కర్ణాటకలోని ఎత్తినబుదేహాళ్‌కు చెందిన పేకాట నిర్వాహకుడు బోయ రవితో పాటు బొమ్మనహాళ్‌కు చెందిన 12 మంది ఉన్నారు.

అక్షరాస్యతే ప్రగతికి ఆధారం



మాట్లాడుతున్న ఎంపీడీఓ నందకిశోర్

బ్రహ్మసముద్రం: అక్షరాస్యత ప్రగతికి ఆధారం అని ఎంపీడీఓ నందకిశోర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ నందకిశోర్, పరిశీలకుడు రవి, ఇన్‌చార్జ్ ఏపీఎం హుసేన్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ నిరక్ష్యరాసులను అక్షరాసులుగా చేయడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఏంఈఓ 2 కృష్ణానాయక్, సీసీలు తిప్పేస్వామి, కామరాజు, దొణ తిమ్మప్ప, మహిళా సంఘాల సభ్యులు, యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతపై బీమా భారం

- రబీ నుంచి రైతులే ప్రీమియం కట్టుకునేలా ఆదేశాలు
- నోటిఫికేషన్ జారీచేసిన కూటమి సర్కార్
- ఐదేళ్లు ప్రీమియం చెల్లించిన జగన్ ప్రభుత్వం
- ఏటా 84,824 మంది రైతులపై రూ.113.24 కోట్లు భారం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతన్నలు

గత ప్రభుత్వం చెల్లించిన ఉచిత పంటల బీమా ప్రీమియం ఇలా..

నియోజకవర్గం	రైతుల సంఖ్య	లబ్ధి రూ.కోట్లలో
రాయదుర్గం	1,11,988	రూ.199.11
కళ్యాణదుర్గం	1,59,370	రూ.193.62
ఉరవకొండ	1,04,557	రూ.185.15



వర్షానికి దెబ్బతిన్న మిరప పంట (ఫైల్)



సాగుచేసిన వరి పంట

రాయదుర్గం: ఉచిత పంటల బీమాపై కూటమి సర్కార్ చేతులెత్తేసింది. ఆ భారాన్ని రైతులపైనే మోపింది. ఫలితంగా అన్నదాతలను మరింత కష్టాల్లోకి నెట్టింది. మాది రైతు ప్రభుత్వం.. రైతులకు అండగా ఉంటామంటూ ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు ప్రగల్భాలు పలుకుతూనే నిండాముంచేశారు. మళ్లీ పాత కష్టాలనే తెచ్చిపెట్టారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులపై పైసా భారం మోపకుండా మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేశారు. ప్రస్తుత కూటమి సర్కార్ ఆ పథకానికి మంగళం పాడేశారు. రబీ నుంచి రైతులే బీమా చెల్లించుకోవాలని సీఎం చంద్రబాబు నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ పంట ఆధారంగానే పంటల బీమా

ఈ–పంట ఆధారితంగానే గత ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లించింది. ప్రకృతి విపత్తుల దృష్ట్యా పంటలు దెబ్బతింటే సత్వరం పరిహారం అందేలా చర్యలు చేపట్టింది. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని గడిచిన ఐదేళ్లలో 3,75,915 మంది రైతులకు రూ.577.88 కోట్లు ఒక్క బీమా ప్రీమియం రూపంగానే మాజీ సీఎం వైఎస్ జగన్ చెల్లించి ఆదుకున్నారు. సగటున ఏడాదికి 84,824 మంది రైతులకు రూ.113.24 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం ఈ భారం రైతులే మోయాల్సిన దుస్థితి దాపురించింది.

ప్రీమియం చెల్లించకపోతే .. బీమా గోవింద

రబీ 2024–25 సీజన్‌లో వివిధ పంటలు సాగు చేసిన రైతులు తప్పక ప్రీమియం కట్టుకోవాలి..ఏమాత్రం అజాగ్రత్త వహించినా బీమా పరిహారం వదులుకోవాల్సి వస్తోంది. ప్రకృతి విపత్తులు సంభవించి నష్టపోతే నిండామునగాల్సిన దుస్థితి. రైతులు ఈ విషయంలో జాగ్రత్త వహించాలి. గతంలాగా ప్రభుత్వమే చెల్లిస్తుందని నిర్లక్ష్యంగా ఉంటే నష్టపోవాల్సిందే.

ప్రభుత్వమే చెల్లించాలి



పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి. ఇప్పటికే ఎన్నో కష్టాలు అనుభవిస్తున్న రైతుపై ఈ భారం సరైంది కాదు. ప్రభుత్వం ఆలోచించి దీనిపై సరైన నిర్ణయం తీసుకోవాలి.

– తిప్పేస్వామి, సింగానహళ్లి గ్రామం, బొమ్మనహాళ్ మండలం

రైతులను ఆదుకోవాలి



గత ప్రభుత్వంలో మాదిరిగానే ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా ఉచిత పంటల బీమా ప్రీమియం చెల్లించాలి. రైతుపై ఆ భారం తప్పించాలి. నష్టాల్లో, కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలి. లేకుంటే తీవ్ర వ్యతిరేకత మూటకట్టుకోవాల్సి వస్తోంది.

– వాల్మీకి రాముడు, రైతు, చెరువుదొడ్డి, గుమ్మఘట్ట మండలం

డిసెంబర్‌లోపు ప్రీమియం చెల్లించాలి

రబీలో సాగు చేసిన రైతులంతా డిసెంబర్ 15లోపు బీమా ప్రీమియం చెల్లించాలి. ఎకరం వరికైతే రూ.638, వేరుశనగ రూ.486, మొక్కజొన్న రూ.525, పప్పుశనగ రూ.486, జొన్న రూ.315, పెసలు రూ.273 చెల్లించాలి. ముందుగా వ్యవసాయాధికారులను సంప్రదించి, ఏ పంటకు ఎంత చెల్లించాలో తెలుసుకొని బ్యాంకుల్లో ప్రీమియం చెల్లించుకోవాలి. ఈ దిశగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– లక్ష్మానాయక్, ఏడీఏ, రాయదుర్గం

వాడీవేడీగా మండల సర్వసభ్య సమావేశం

- మంత్రి పయ్యావుల హామీ అమలుకాకపోవడంపై సభ్యుల నిలదీత
- సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పనులు ప్రారంభంకాకపోవడంపై అసంతృప్తి



సమావేశంలో సమస్యలపై నిలదీస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు పాపన్న, మునయ్య తదితరులు

వజ్రకరూరు: ఐదు నెలల క్రితం మంత్రి పయ్యావుల ఇచ్చిన హామీలు అమలు కాలేదని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు నిలదీశారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంపీపీ రమావత్ దేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశం ఆద్యంతం వాడీవేడీగా జరిగింది. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు పాపన్న, మద్దిలేటక్కగారి మునయ్య తదితరులు మాట్లాడారు. జూలై 29న మంత్రి పయ్యావుల కేశవ్ కొనకొండ్ల సత్యసాయి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు (రిజర్వాయర్)ను సందర్శించి, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. చీరాల నుంచి ఇసుక తెప్పించి, మైక్రో ఫిల్టర్ బెడ్లను ఏర్పాటు చేయిస్తామని, అందుకు సంబంధించి అధికారులకు ఆదేశాలు జారీ చేసినా నేటికీ పట్టించుకోలేదని నిలదీశారు. నెలలు గడుస్తున్నా రిజర్వాయర్‌లో పనులు ప్రారంభం కాలేదన్నారు. ఎన్నికల సమయంలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కొళాయి ఇస్తామని చెప్పిన హామీ నెరవేరలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు మాట్లాడుతుండగా టీడీపీ సర్పంచు సుదీప్‌కుమార్ మంత్రి పేరు తీసుకురాడం సరికాదని కోపంతో ఊగిపోయారు. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, టీడీపీ మద్దతుదారు సర్పంచు మధ్య వాగ్వాదం జరిగింది. ఎంపీడీఓ రవిప్రసాద్ కలగజేసుకుని సర్దిచెప్పారు.

సమస్యలపై గళమెత్తిన ప్రజాప్రతినిధులు: మండల కేంద్రంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు ప్రజాసమస్యలపై గళమెత్తారు. చాబాల సర్పంచు మల్లెల జగదీష్, గూళ్యపాళ్యం ఎంపీటీసీ ఈశ్వరమ్మ, గడేహోతూరు సర్పంచు సురేంద్ర, వజ్రకరూరు సర్పంచు మోనాలిసా, కొనకొండ్ల ఎంపీటీసీలు పాపన్న, మునయ్య తదితరులు సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. మండల సర్వసభ్యసమావేశానికి పలువురు అధికారులు డుమ్మా కొట్టారు. నాడు–నేడు పనుల పర్యవేక్షణపై ఎంఈఓ ఎర్రిస్వామిని సభ్యులు ప్రశ్నించారు. వజ్రకరూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ప్రజాప్రతినిధులు డిమాండ్‌చేశారు.

రైతులపై నిర్లక్ష్యం తగదు

రాయదుర్గంటౌన్: రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం తగదని సీపీఐ నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సబ్‌స్టేషన్ వద్ద డీఈ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సీపీఐ కార్యవర్గ సభ్యుడు కొట్రేష్ మాట్లాడుతూ గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్, రాయదుర్గం రూరల్ పరిధిలోని వందలాది మంది రైతులు డీడీలు చెల్లించి, నెలలు గడుస్తున్నా నేటి వరకూ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయలేదన్నారు. బోర్లు వేసుకుని, డ్రిప్ ఏర్పాటు చేసుకుని పంటల సాగుకు విద్యుత్ సమస్య వెంటాడుతున్నట్లు చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఎదురుచూస్తున్నా విద్యుత్‌శాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దుర్గన్న, రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు నరసింహులు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు నాగరాజు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, తాలూకా అధ్యక్షుడు అంజి పాల్గొన్నారు.

కొండను కొల్లగొట్టేస్తున్నారు...!

- పట్ట పగలే బ్లాస్టింగ్
- కూటమి నేతల అండతో చదును పనులు
- తూతూ మంత్రంగా తనిఖీలు



అక్కమాంబ ఆలయ సమీపంలో 301 సర్వే నంబర్‌లో చేసిన బ్లాస్టింగ్

కళ్యాణదుర్గం: అక్కమాంబ కొండను అక్రమార్కులు కొల్లగొట్టేస్తున్నారు. పట్టపగలే అనంతపురం రహదారి పక్కన బ్లాస్టింగ్ చేస్తూ స్థానికులకు భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ప్రశ్నించే వారిని స్థానిక టీడీపీ కూటమి నేతల అండ తమకు ఉందంటూ చెప్పుకుంటూ యథేచ్ఛగా కొండను తవ్వేస్తున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంతో పాటు అటు ఏపీ, కర్ణాటక రాష్ట్ర ప్రజలకు తలమానికంగా ఉంటూ ఆరాధ్య దైవంగా వెలుగొందుతున్న అక్కమాంబ ఆలయం సమీపంలో అక్రమార్కులు కొండను కొల్లగొట్టేస్తున్నారు. కొండకు ఆనుకుని ఉన్న విలువైన స్థలాన్ని కబ్జా చేసేందుకు ఎత్తుగడ వేస్తున్నారు. సర్వే నంబర్ 301లో పట్టపగలే అక్రమార్కులు బ్లాస్టింగ్ చేస్తూ రాళ్లను పగులకొడుతున్నారు.

ప్రశ్నించే వారికి బెదిరింపులు..

మూడు రోజులుగా బ్లాస్టింగ్‌పై అటు అక్కమాంబ ఆలయ కమిటీ సభ్యులు, రెవెన్యూ అధికారులు సదరు సర్వే నంబర్లో పనులు చేస్తున్న వారిని ప్రశ్నించగా, తాము అధికార పార్టీకి చెందిన కూటమి నేతలంటూ భయభ్రాంతులకు గురి చేస్తుండటం గమనార్హం. గతంలో ఆలయ పరిసర ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టాలంటే ఆలయ కమిటీ, రెవెన్యూ అధికారులను సంప్రదించి, ఎలాంటి అభ్యంతరం లేనప్పుడు నిర్మాణాలు జరిగేవి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఎవ్వరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం లేదంటూ అక్రమార్కులు చెప్పుకుంటున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా చదును..

అక్కమాంబ కొండకు ఆనుకొని ఉన్న 301 సర్వే నంబర్‌లో ప్రభుత్వ నిబంధనల మేరకు గ్రామకంఠం భూమితో పాటు ప్రభుత్వ భవనాలకు స్థలాలను కేటాయించారు. అయితే అక్రమార్కులకు ఇవేవీ పట్టకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చదును చేసినట్లు సమాచారం. దీనిపై భూమి యజమాని ఎవరనేది తెలుసుకునే ప్రయత్నం చేసినా రెవెన్యూ అధికారుల వద్దకు ఎవరూ రాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అక్కమాంబ కొండకు ఆనుకొని కొండ స్థలాన్ని సైతం ఆక్రమించుకోవడంపై ఆలయ కమిటీ సభ్యులు మండిపడుతున్నారు.

బ్లాస్టింగ్ మిషన్ యజమానిపై పోలీసులకు ఫిర్యాదు..

అక్కమాంబ కొండ సమీపంలో అక్రమంగా లేఅవుట్‌లో పట్టపగలు బ్లాస్టింగ్ చేస్తున్న మిషన్ యజమానిపై రెవెన్యూ అధికారులు కళ్యాణదుర్గం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా పట్టపగలే ఎలా తవ్వకాలు చేస్తారంటూ అధికారులు ప్రశ్నించడంతో మిషన్ యజమాని కంగుతిన్నారు. అంతటితో ఆగకుండా తమకు ఎలాంటి సంబంధం లేదని తమ యజమాని చెప్పిన ప్రకారం పనులు చేస్తున్నామంటూ మిషన్ యజమానులు చెప్పడం గమనార్హం. కాగా దీనిపై రెవెన్యూ అధికారులు తూ తూ మంత్రంగా విచారణ చేపట్టారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

భూ యజమానులు ఎవరూ రాలేదు

అనుమతులు లేకుండా స్థలాన్ని చదును చేస్తున్నారన్న దానిపై సిబ్బందిని సదరు స్థలంలోకి పంపించాం. అయితే అక్కడ బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న మిషన్ యజమానిపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాం. అయితే సదరు సర్వే నంబర్‌లో దొడగట్ట గ్రామస్తులు వేరొకరికి అమ్మిన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించాం. త్వరలోనే దీనిపై పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.– భాస్కర్, తహసీల్దార్, కళ్యాణదుర్గం

డిగ్రీ విద్యార్థుల సేవలకు ప్రశంస



ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థులు

రాయదుర్గం: పట్టణ పరిధిలోని బళ్లారి రోడ్డులో ఉండే రామకృష్ణా వృద్ధాశ్రమంలో 30 రోజులుగా విశిష్ట సేవలందించిన కేటీఎస్ డిగ్రీ కళాశాలకు చెందిన భౌతికశాస్త్ర విద్యార్థినీ, విద్యార్థులకు ప్రశంసలు వెల్లువెత్తాయి. శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రఘురామమూర్తి ఆధ్వర్యంలో వృద్ధాశ్రమ మేనేజర్ సురేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో విద్యార్థులకు ఘన సన్మానం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 30 రోజులుగా పోషకాలతో కూడిన వివిధ రకాల పళ్లను వృద్ధులకు అందించి, విద్యార్థులు మానవత్వం చాటుకున్నారు. అనంతరం వృద్ధాశ్రమం తరపున విద్యార్థి, విద్యార్థినులకు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, తెలుగు అధ్యాపకులు లక్ష్మీనారాయణ, భౌతికశాస్త్ర అధ్యాపకులు ప్రసాద్, కోదండరాములు, నారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

14న బొడ్రాయి, ధ్వజస్తంభ ప్రతిష్ఠ

కూడేరు: మండలంలోని కడదరకుంటలో ఈ నెల 14న బొడ్రాయి, ఆంజనేయస్వామి ఆలయం ముందు ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, గ్రామ పెద్దలు శుక్రవారం తెలిపారు. ప్రతిష్ఠ కార్యక్రమాలు ఈ నెల 12 నుంచే ప్రారంభమవుతాయన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

విడపనకల్లు: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సునీతా బాయి తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి పంచాయతీలో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో 9,10 తేదీల్లో రెండు రోజులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఓటరు జాబితాలో ఓటర్లు పేర్లు, అడ్రసు, వేర్వేరు పోలింగ్ కేంద్రానికి ఓటరు బదిలీలు, తప్పొప్పులపై కూడా బూత్‌లెవల్ ఆఫీసర్లను సంప్రదించి, దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

గుమ్మఘట్ట: చిన్నారులకు మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా అందించాలని ఎంపీడీఓ రామకృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, పలు సలహాలు, సూచనలు అందించారు. మెనూ అమలు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు.

భార్యపై భర్త దాడి

కణేకల్లు: యర్రగుంట గ్రామానికి చెందిన శ్రావణిపై భర్త వెంకటేష్ దాడి చేసినట్లు ఏఎస్‌ఐ శంకర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. రాయదుర్గం మండలం టీ.వీరాపురం గ్రామానికి చెందిన శ్రావణికి పదేళ్ల క్రితం యర్రగుంట గ్రామానికి చెందిన వెంకటేష్‌తో వివాహమైంది. వీరికి కార్తీక్ (9), సాహిత్య (7)లు సంతానం. రెండేళ్ల క్రితం భార్యాభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్ధలతో ఇద్దరూ గొడవపడ్డారు. దీంతో ఆమె భర్త, పిల్లలను వదిలేసి పుట్టింటికెళ్లింది. అనంతరం గురువారం సాయంత్రం 6:30 గంటలకు భర్త ఇంటికొచ్చింది. వారి మధ్య వాగ్వాదం జరిగింది. మాటామాటా పెరగడంతో శ్రావణిపై భర్త దాడి చేశాడు. జరిగిన ఘటనపై బాధితురాలిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

15నుంచి కడ్లే గౌరమ్మ జాత్ర

విడపనకల్లు: ఈనెల 15 నుంచి విడపనకల్లు కడ్లే గౌరమ్మ జాత్ర ప్రారంభమవుతుందని కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. 15న నోములు, 16న కడ్లే గౌరమ్మ ప్రతిష్ఠ, 17న చక్కెర హారతులు, 18న కడ్లే గౌరమ్మ ఊరేగింపు అనంతరం నిమజ్జనం ఉంటుందని కమిటీ తెలిపింది.

40 కర్ణాటక టెట్రా ప్యాకెట్ల పట్టివేత

గుమ్మఘట్ట: మండలంలోని కేపీ దొడ్డిలోని చిల్లర దుకాణంలో కర్ణాటక మద్యం ప్యాకెట్లు విక్రయిస్తున్న మారెన్న అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపారు. అతని వద్ద నుంచి 40 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని అతనిపై ఎక్సైజ్ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

కుందుర్పి: మండలంలోని జంబుగుంపులకు చెందిన దుర్గన్న గత కొన్ని రోజులుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. దుర్గన్నను బెంగుళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. రోజుకు రూ. 10 వేలు ఖర్చవుతోంది. దీంతో ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ గ్రామానికి వెళ్లి బాధితుడు దుర్గన్నకు రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు.

సీపీఎం మండల కార్యదర్శిగా గాజుల విరూపాక్షి



వజ్రకరూరు: సీపీఎం మండల కార్యదర్శిగా గూళ్యపాళ్యం గ్రామానికి చెందిన గాజుల విరూపాక్షి ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక జనార్దన వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సీపీఎం మండల సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు బాల రంగయ్య, జిల్లా కమిటీ సభ్యుడు రంగారెడ్డి, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి తదితరులు హాజరయ్యారు. అనంతరం జరిగిన సమావేశంలో వజ్రకరూరు మండలం సీపీఎం కమిటీని ఎంపిక చేశారు. మండల కార్యదర్శిగా గూళ్యపాళ్యం గాజుల విరూపాక్షి, కమిటీ సభ్యులుగా చాబాల సుధాకర్, పెద్దన్న, మునెమ్మ, ఓబుళపతి , ప్రకాష్, గూళ్యపాళ్యం సుధాకర్ తదితరులను ఎంపిక చేశారు.

వర్షాధారం కింద తగ్గిన వేరుశనగ దిగుబడి

కూడేరు: మండలంలో వర్షాధారం కింద ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన వేరుశనగ పంట దిగుబడి బాగా తగ్గిపోయింది. శుక్రవారం మండలంలోని తిమ్మాపురంలో అధికారులు వేరుశనగలో పంట కోత ప్రయోగం చేశారు. కాగా దిగుబడి అంతంత మాత్రమే వచ్చింది. 5X5 మీటర్ల విస్తీర్ణంలో పంట కోత ప్రయోగాన్ని చేపట్టగా, కేవలం 1100 గ్రాములు దిగుబడి వచ్చినట్లు మండల గణాంకాధికారిణి (ఏఎస్‌ఓ) ఆశా తెలిపారు. సాధారణంగా దిగుబడి బాగుంటే ఎకరాకు 400 కేజీలకు పైగానే దిగుబడి వస్తుందన్నారు. ప్రస్తుతం 120 కేజీలు మాత్రమే వస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓ రాజకుమార్ , రైతులు పాల్గొన్నారు.

హజరత్ సయ్యద్ షామోహీద్దీన్ పరీ ఖాద్రీ ఉరుసు

విడపనకల్లు: విడపనకల్లులో శుక్రవారం నుంచి హజరత్ సయ్యద్ షామోహీద్దీన్ పరీ ఖాద్రీ ఉరుసు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రాత్రి గంధం ఊరేగించారు. మతాలక అతీతంగా దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించి, చక్కెర చదివింపులు చేశారు. శనివారం హజరత్ సయ్యద్ షామోహీద్దీన్ పరీ ఖాద్రి శంషేర్ ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దర్గా పీఠాధిపతి సిరాజ్ సాహెబ్ తెలిపారు.

జీవనశైలిలో మార్పు చేసుకోవాలి

రాయదుర్గంటౌన్: ప్రతి ఒక్కరూ జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా షుగర్, బీపీ, గుండె జబ్బులు, పక్షవాతం, అసాధరణ కొలెస్ట్రాల్ వంటి అసంక్రమిత వ్యాధుల నుంచి రక్షణ పొందొచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ రాయదుర్గంలో భాగంగా పట్టణంలోని ఓబుళాచారి రోడ్డులో అసంక్రమిత వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫ్రైడే డ్రైపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ నేల 14 నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటింటికీ అసంక్రమిత వ్యాధులు ఎన్‌సీడీ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. కేన్సర్ సమస్య ఉంటే ఇంటి వద్దనే స్క్రీనింగ్ జరిపి అనుమానిత కేసులను అనంతపురంలోని అంకాలజీ విభాగానికి పంపనున్నట్లు తెలిపారు. ప్రతి శుక్రవారం ఇళ్ల వద్ద డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన నీటిని పారవేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకురాలు లక్ష్మీనరసమ్మ, శాంతికుమారి, హెల్త్ సెక్రటరీలు ఈశ్వరి, మమత, సరోజ, రూప, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మారెమ్మ, సుంకలమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠ

బొమ్మనహాళ్: మండలంలోని సింగానహళ్లిలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మారెమ్మ, సుంకలమ్మ దేవి విగ్రహాల ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. గణపతిపూజ, నవగ్రహ, రుద్ర హోమాలు, అంకురార్పణ, ప్రదోషకాల పూజలు నిర్వహించి, బ్రహ్మముహుర్తంలో అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. అన్నదానం చేశారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొని, పూజలు చేశారు.

లక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు



రామాలయంలో అలంకరణలో దర్శనమిస్తున్న లక్ష్మీదేవి

కూడేరు: కార్తీక మాస శుక్రవారాన్ని పురస్కరించుకొని కూడేరులోని కోదండ రామాలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి ఆలయ అర్చకులు భాస్కర్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి దేవత నామస్మరణ మార్మోగింది. అనంతరం అర్చకుడు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గజలక్ష్మి ఆలయంలో పూజలు

రాయదుర్గంటౌన్: మల్లాపురం ఇందిరమ్మ కాలనీలో వెలసిన గజలక్ష్మి దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు చేసి హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ప్రతి శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడంతోపాటు కార్తీక మాసం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి



సీహెచ్ మోహన్‌రావు మృతదేహాన్నికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

బొమ్మనహాళ్: మండలంలోని దేవగిరికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎంసీహెచ్ రాజ్‌కుమార్ తండ్రి సీహెచ్ మోహన్‌రావు (70) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు.వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి దేవగిరి గ్రామంలో సీహెచ్ మోహన్‌రావు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైస్ ఎంపీపీ కందేపల్లి రమేష్, సర్పంచ్‌లు రాధిక, పరమేశ్వర, తిప్పేస్వామి, ఆంజనేయులు ముక్కన్న, నాయకులు సూర్యప్రతాప్‌రెడ్డి, హనుమేష్, వెంకటేశులు, సర్మాస్, మురళి తదితరులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఓబీసీలో చేర్చడానికి అసెంబ్లీలో తీర్మానం చేయాలి



లింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న అఖిల భారత లింగాయత్ సంఘం నేతలు

ఉరవకొండ: వీరశైవ లింగాయత్‌లను ఓబీసీలో చేర్చడానికి అసెంబ్లీలో తీర్మానం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక వీరశైవ కళ్యాణ మండపంలో అఖిల భారత వీరశైవ లింగయత్ ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సమావేశంలో అఖిల భారత వీరశైవ సంఘం నాయకులు మల్లికార్జున, నాగన్నగౌడ్, నిరంజన్‌గౌడ్, దేశాయి గంగాధర్, బొజ్జప్ప మాట్లాడారు. ఇప్పటికే గ్రామాలు, మండలాలు, నియోజకవర్గాల్లో ఓబీసీ సాధన కోసం లింగాయత్‌లను చైతన్యం చేసినట్లు తెలిపారు. ఈనెల 11 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం లింగాయత్‌లు ఓబీసీలో చేర్చడానికి తీర్మానం చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో లింగాయత్‌ల సంఘం నేతలు పాల్గొన్నారు.